కూరగాయల సాగు బాగు!


ఆరికతోటలో క్యాబేజి పంట సాగుకు రైతులకు సూచనలిస్తున్న ఉద్యానశాఖాధికారి మోహనకృష్ణ

- కూరగాయల సాగులో దూసుకుపోతున్న రైతులు
- 250 గ్రామాల్లో ఆకుకూరలు, కూరగాయల సేద్యం
- అధికారుల సూచనలతో అధిక దిగుబడులు
- అంతర్‌రాష్ట్ర మార్కెట్‌లో పంటలకు మంచి డిమాండ్
- లాభాలు ఆర్జిస్తున్న అన్నదాతలు

రామభద్రపురం: జిల్లా వ్యాప్తంగా కూరగాయల సాగు బాగుంది. వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు పాటిస్తూ రైతులు పంటలు పండించడంలో దూసుకుపోతున్నారు. అధిక దిగుబడులు సాధిస్తూ అధిక లాభాలు ఆర్జిస్తున్నారు. రామభద్రపురంతో పాటు బొబ్బిలి, బాడంగి, గజపతినగరం, దత్తిరేజేరు, గజపతినగరం, సాలూరు మండలాల పరిధిలోని దాదాపు 250 గ్రామాల రైతులు కూరగాయ పంటల సాగులో అద్భుతమైన ఫలితాలు సాధిస్తున్నారు. తోటి రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారు.


ఉల్లి పంటలో అంతర పంటగా క్యారెట్ సాగు చేస్తున్న దృశ్యం

500 కుటుంబాలకు ఇదే జీవనాధారం..

రామభద్రపురం మండల కేంద్రంలో అంతర్‌రాష్ట్ర కూరగాయల మార్కెట్ ఉండడంతో ఇదే మండలంలోని 500 కుటుంబాలు కూరగాయల సాగును ప్రధాన వృత్తిగా చేసుకుని జీవిస్తున్నారు. అన్ని కాలాల్లోనూ పండిస్తూ ఏడాది పొడవునా ఆదాయం పొందుతున్నారు. విత్తనం వేసిన దగ్గర నుంచి పంట చేతికి వచ్చే వరకు సస్యరక్షణ చర్యలు చేపట్టి, అధిక దిగుబడులు వచ్చేలా సాగులో ముందుకు సాగుతున్నారు. తమకున్న చిన్నచిన్న కమతాల్లోనే రకరకాల పంటలు వేస్తూ నాణ్యమైన పంటలు పండిస్తున్నారు.

30, 40 సెంట్ల విస్తీర్ణంలోనే...

కేవలం 30.. 40 సెంట్ల విస్తీర్ణంలోనే టమాటా, ఉల్లి, ముల్లంగి, చిక్కుడు, వంగ, తోటకూర, మిరప, బెండ, క్యాబేజి, కాలీఫ్లవర్, గోరుచిక్కుడు, బీట్‌రూట్, క్యారెట్, ఆనప, కొత్తిమీర, తోటకూర వంటి కూరగాయలు, ఆకుకూరలు పండిస్తున్నారు. వీటితో పాటు బంతి, చామంతి, కనకాంబరాలు, గులాబి వంటి పూలతోటలు కూడా వేస్తున్నారు. వాటిలో ఏదో పంటను ప్రధాన పంటగా మిగతా వాటిని అంతర పంటలుగా వేసుకుని, అదనపు ఆదాయం సంపాదిస్తున్నారు. వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోయినా, మరే ఇతర కారణంతోనైనా ఒక పంట పాడైనా మరో పంట ఉంటుందన్న ఆలోచనతో వారు చేస్తున్న వ్యవసాయ ప్రయోగం వారితో చక్కటి ఫలితాలు వచ్చేలా చేస్తోంది. రైతులంతా ఒకే పంటను సాగు చేస్తే మార్కెట్‌లో డిమాండ్ పరంగా సమస్య వస్తుందని, అరెకరం పొలంలో రకరకాల పంటలు పండిస్తున్నారు.


రామభద్రపురంలో ఉల్లి సాగులో అంతర పంటగా వేసిన చిక్కుడు పంటను పరిశీలిస్తున్న రైతు

ఉల్లి తర్వాత క్యారెట్ వేస్తా..



ప్రతిరోజూ ఎంతో కొంత ఆదాయం వచ్చేలా కూరగాయలు సాగు చేస్తున్నా. ప్రస్తుతం 25 సెంట్లలో ఉల్లి వేశాను. మరో 10 రోజుల్లో పంట చేతికి వస్తుంది. ఆ తర్వాత క్యారెట్ పండిస్తాను. నిత్యం ఇలా పంటలు వేస్తూ ఏడాది మొత్తం ఆదాయం సంపాదిస్తాం. మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉన్న పంటలనే సాగు చేస్తాం. – పొందూరు అప్పన్న, కూరగాయల రైతు, రామభద్రపురం

ఏడాది పొడవునా సాగు..



వ్యవసాయ శాస్త్రవేత్తలు, ఉద్యాన, వ్యవసాయ శాఖల అధికారుల సలహాలు సూచనలు పాటిస్తూ ఏడాది పొడవునా పంటలు పండిస్తూ అధిక దిగుబడులు, లాభాలు సాధించవచ్చు. అన్ని సీజన్లలోనూ ఏ సీజన్‌లో ఏ పంటకు డిమాండ్ ఉంటుందో ఆ పంటను సాగు చేస్తే మంచి రాబడి వస్తుంది. రెండు, మూడు రకాల పంటలు వేసుకుంటే ఒక పంట తర్వాత మరొకటి చేతికి వస్తుంది.

– పి.మోహనకృష్ణ, ఉద్యానశాఖాధికారి, రామభద్రపురం

క్లుప్తంగా

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ


వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బేబీనాయన

బొబ్బిలి: మండల కేంద్రంలో జోనల్ స్థాయి బాడీ బిల్డింగ్ పోటీల వాల్‌పోస్టర్‌ను ఎమ్మెల్యే బేబీనాయన మంగళవారం ఆవిష్కరించారు. ఛత్రపతి శివాజి జయంతి పురస్కరించుకుని, స్థానిక హనుమాన్ దీక్షా సేవా సమితి ఆధ్వర్యంలో ఈ నెల 19వ తేదీన స్థానిక సంస్థానం ఉన్నత పాఠశాల మైదానంలో ఈ పోటీలు ఉంటాయని, ఆసక్తి కలిగిన వారు పాల్గొనాలని నిర్వాహకులు కోరారు.

పత్ర కషాయం తయారీపై అవగాహన


మామిడి పూతపై పిచికారీకి సిద్ధం చేసిన పలుపత్రం కషాయం

బొబ్బిలి: మండలంలోని మల్లంపేటలో పలుపత్ర కషాయం తయారీపై మంగళవారం అవగాహన కల్పించారు. బొప్పాయి, తులసి, జామ, కాగు, వేప, మారేడు, జిల్లేడు, వెదురు, మునగ, ఉమ్మెత్త ఆకులతో కషాయం తయారు చేసి, దాని ప్రయోజనాలు వివరించారు. ప్రస్తుతం కురుస్తున్న మంచు కారణంగా మామిడి పూత రాలిపోవడం, మాడిపోవడం జరుగుతోందని, దీని నివారణకు పలుపత్ర కషాయం పిచికారీ చేయాలని ప్రకృతి వ్యవసాయం ప్రతినిధి ఉరిటి శంకరరావు తెలిపారు.

పింఛన్ల పంపిణీపై ఎంపీడీవో దర్యాప్తు


రాజయ్యపేట సచివాలయ సిబ్బందిని ఆరాతీస్తున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

రాజాం: మండలంలోని పెనుబాక, రాజయ్యపేట గ్రామాల్లో ఫిబ్రవరి నెలలో పంపిణీ చేసిన పింఛన్లపై ఎంపీడీవో వి.శ్రీనివాసరావు మంగళవారం దర్యాప్తు చేశారు. ఆయా గ్రామాల్లో ఐవీఆర్ఎస్ సర్వేలో పలువురు లబ్ధిదారులు తమకు ఇంటి వద్ద పింఛన్ అందివ్వలేదన్న ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టినట్లు ఎంపీడీవో తెలిపారు. లబ్ధిదారులు తెలిపిన వివరాలను నివేదిక రూపంలో కలెక్టరుకు అందిస్తామన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం



సంతకవిటి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రచారం చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

సంతకవిటి: మండలంలోని మందరాడ, సంతకవిటి, జి.ఎస్.పురం, బొద్దూరు, మామిడిపల్లి, సిరిపురం, హొంజరాం, మండాకురిటి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, వాసుదేవపట్నం కేజీబీవీ (కస్తూరిబాగాంధీ బాలికా విద్యాలయం)లో యూటీఎఫ్ నాయకులు మంగళవారం ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం చేపట్టారు. పీడీఎఫ్ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరికి సంపూర్ణ మద్దతు తెలిపి, ఎమ్మెల్సీగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి రెడ్డి మోహనరావు, మండల అధ్యక్షుడు బూరాడ శ్రీనివాసం, ప్రధాన కార్యదర్శి డి.కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

రేగిడి: మండల పరిషత్ నిధులతో గ్రామాల్లో చేపడుతున్న సీసీ రోడ్లు, కాలువల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఎంపీపీ దార అప్పలనరసమ్మ, వైస్ ఎంపీపీలు టంకాల అచ్చెన్నాయుడు, వావిలపల్లి జగన్మోహనరావులు సూచించారు. మండలంలోని బూరాడ, లక్ష్మీపురం, అప్పాపురం, మజ్జిరాముడుపేట, వన్నలి తదితర గ్రామాల్లో జరుగుతున్న సీసీ రోడ్లు, కాలువల నిర్మాణాలను వారు మంగళవారం పరిశీలించి, పలు సూచనలు చేశారు.

గోమాతకు పూజలు


గోమాతకు పూజలు చేస్తున్న దృశ్యం

రాజాం సిటీ: గో ఆధారిత సేద్యం ద్వారా నేలకు ఎంతో మేలు చేకూరుతుందని వికాస తరంగిణి సెంట్రల్ ఆర్గనైజింగ్ కార్యదర్శి టీటీవీ రమణమూర్తి అన్నారు. స్థానిక అమ్మవారి కాలనీలో ప్రకృతి వ్యవసాయంపై మంగళవారం అవగాహన కల్పించారు. గోమాతను కాపాడుకుని రైతులు గోవుల మలమూత్రాలతో ఎరువు, కషాయాలు తయారు చేసుకుని పంటలకు వాడుకోవాలన్నారు. అంతకుముందు గోమాతకు పూజ చేసి, దాని విశిష్టతను తెలిపారు. రసాయన ఎరువుల వాడడం వల్లే చిన్నారులు సుగర్, బీపీ, కేన్సర్, గుండె, కిడ్నీ సంబంధిత వ్యాధుల బారినపడుతున్నారని, వీటన్నింటికీ పరిష్కారం గో ఆధారిత సేద్యమేనన్నారు.

ఉపాధి పనుల పరిశీలన


మస్తర్లు పరిశీలిస్తున్న ఏపీవో హరనాధరావు

సంతకవిటి: ఉపాధి హామీ పనులకు వచ్చే వేతనదారులు సమయపాలన పాటించాలని ఏపీవో హరనాధరావు సూచించారు. మండలంలోని శ్రీహరినాయుడుపేటలోని మడ్డువలస కాలువతో పాటు మూడు చెరువుల్లో జరుగుతున్న ఉపాధి పనులను ఆయన మంగళవారం పరిశీలించారు. రెండు పూటలా పనులు చేయాలని, పని ప్రదేశంలో ప్రతీ గ్రూప్ ఫొటో తీసి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు.


రాజాం సిటీ: బొమ్మినాయుడువలసలో జరుగుతున్న ఉపాధి పనులు

రాజాం సిటీ: మండలంలోని బొమ్మినాయుడువలస గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను ఎంపీడీవో వి.శ్రీనివాసరావు మంగళవారం పరిశీలించారు. రెండు పూటలా నిర్దేశిత కొలతల ప్రకారం పనులు చేయాలని, అప్పుడే గిట్టుబాటు అయ్యే వేతనం లభిస్తుందన్నారు.

ఘనంగా రథసప్తమి వేడుకలు


రాజాం గాయత్రీ కాలనీలో కొలువైన సూర్యభగవానునికి పూజలు చేస్తున్న భక్తులు


రాజాం సిటీ: కొండంపేటలో మహిళల పూజలు


రాజాం సిటీ: పొనుగుటివలసలో సూర్యనమస్కారాలు చేస్తున్న చిన్నారులు


బొబ్బిలి సంస్థానం ఉన్నత పాఠశాలలో విద్యార్థుల సూర్యనమస్కారాలు

రాజాం/రాజాం సిటీ/బొబ్బిలి: మండలాల్లో రథసప్తమి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. వేకువజామున పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు ఆలయాలకు చేరుకుని, సూర్యభగవానుని దర్శించుకుని విశేష పూజలు చేశారు. కొన్నిచోట్ల సూర్యనమస్కారాలు చేసి, దైవం పట్ల భక్తిశ్రద్ధలు కనబరిచారు.

బాధ్యతల స్వీకరణ


కె.అనంత్‌కుమార్

వంగర: మండల హౌసింగ్ ఏఈగా కొప్పర అనంత్‌కుమార్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన ఏఈ పైడితల్లి బదిలీపై వెళ్లారు. రాజులగుమ్మడ గ్రామ సచివాలయం ఇంజినీరింగ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న అనంత్‌కుమార్‌ను ఏఈగా నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

వంగర: ఎంఈవో–2గా ఖండాపు జగదీశ్వరి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు ఇదే మండలంలోని అరసాడ గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలిగా విధులు నిర్వహించిన ఆమెను ఎంఈవోగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఆమెను ఎంఆర్‌సీ సిబ్బంది మండల కేంద్రంలో సన్మానించారు.


వంగర: ఎంఈవోగా బాధ్యతలు చేపట్టిన జగదీశ్వరిని సన్మానిస్తున్న ఎంఆర్‌సీ సిబ్బంది

పార్టీ మరింత బలోపేతానికి కృషి చేయాలి

రేగిడి: వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్‌ను పార్టీ నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు కరణం శ్రీనివాసరావు రాజాంలో మర్యాదపూర్వకంగా మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా ఆయన తనకు ఆ పదవి వచ్చేందుకు సహకరించినందుకు గాను రాజేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. రాజేష్ కూడా ఆయనను అభినందించి, పార్టీ మరింత బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో బూరాడ, లక్ష్మీపురం గ్రామాల సర్పంచ్‌లు వావిలపల్లి శశిభూషణరావు, కెంబూరి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


డాక్టర్ రాజేష్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న కరణం శ్రీనివాసరావు


సూర్యప్రభ వాహనసేవ దృశ్యం

వేణుగోపాలునికి వాహన సేవ

బొబ్బిలి: స్థానిక వేణుగోపాలస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాంతర్గత కల్యాణ మహోత్సవాలు మంగళవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం సూర్యప్రభ వాహనసేవ, సాయంత్రం చంద్రప్రభ వాహనసేవ చేపట్టారు. పెద్దఎత్తున భక్తులు హాజరై, స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ నెల 12వ తేదీ వరకు జరిగే ఈ ఉత్సవాల్లో 8వ తేదీన రుక్మిణీ సమేత వేణుగోపాలస్వామి కల్యాణం నిర్వహిస్తామని పురోహితులు తెలిపారు.

11న ప్రసాదాల విక్రయానికి వేలంపాట

వంగర: మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా సంగాంలో వెలసిన శ్రీసంగమేశ్వరస్వామి ఆలయంలో ప్రసాదాల విక్రయానికి ఈ నెల 11వ తేదీన వేలంపాట వేస్తున్నట్లు ఉత్సవ కమిటీ చైర్మన్ బోను ఆనందరావు ఓ ప్రకటనలో మంగళవారం తెలిపారు. 150 గ్రాముల పులిహోర రూ.10, 80 గ్రాముల లడ్డూ ప్రసాదం రూ.15గా ధర నిర్ణయించామని, ఆసక్తి ఉన్నవారు వేలంపాటకు రావాలన్నారు. వేలంలో పాల్గొనేవారు ముందస్తుగా రూ.25 వేలు ధరావత్తు చెల్లించాలన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి

సంతకవిటి: యువత, విద్యార్థులంతా మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్‌ఐ ఆర్.గోపాలరావు సూచించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని విద్యార్థులకు, మందరాడ, జీఎస్‌పురం గ్రామస్తులకు మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్ప్రభావాలపై మంగళవారం అవగాహన కల్పించారు. గంజాయి, ఖైనీ, గుట్కా, పాన్‌పరాగ్, పొగాకు, మద్యం వంటి మత్తు పదార్థాలను తీసుకోవద్దని తెలిపారు. వాటికి అలవాటు పడిన ఎంతోమంది జీవితాలు నాశనమయ్యాయని హెచ్చరించారు.

పరామర్శ


బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్, డాక్టర్ తలే రాజేష్ తదితరులు

రేగిడి: మండలంలోని చిన్నశిర్లాం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ టంకాల గోవిందరావు ఇటీవల మృతి చెందారు. ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్, వైస్ ఎంపీపీలు టంకాల అచ్చెన్నాయుడు, వావిలపల్లి జగన్మోహనరావులు మంగళవారం ఆ గ్రామం వెళ్లి, బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. గోవిందరావు మృతికి గల కారణాలను అడిగి తెలుసుకుని, ప్రగాఢ సానుభూతి తెలిపారు. గోవిందరావు మృతి పట్ల సంతాపం ప్రకటించారు. కార్యక్రమంలో సర్పంచ్ లెంక రాంబాబు, టంకాల ఉమాపాపినాయుడు, కెల్ల మన్మధరావు, కరణం శ్రీనివాసరావు, కెంబూరి వెంకటేశ్వరరావు, సవలాపురపు రమేష్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినుల ఆందోళన



రాజాం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థినులు మంగళవారం ఆందోళనకు దిగారు. కాలేజీ ఆవరణలో అసాంఘిక కార్యాకలాపాలు జరుగుతున్నాయని, తాము ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. ఇదే విషయమై టౌన్ సీఐ అశోక్‌కుమార్‌ను రాజాం పట్టణంలో మంగళవారం కలిసి తమ గోడు విన్నవించుకున్నారు. ఇకనుంచి ఎవరి నుంచైనా ఇబ్బందులు ఎదురైతే తమకు వెంటనే తెలియజేయాలని కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హామీ ఇచ్చారు. అలాగే కళాశాల వద్ద అనుమానితులు, ఆకతాయిల సంచారంపై నిఘా ఉంచుతామన్నారు. అలాగే ప్రధాన రోడ్డుతో పాటు కళాశాల రోడ్డును ఆక్రమించి, వ్యాపారాలు కొనసాగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. – రాజాం సిటీ

నాసిరకమని తేలితే బిల్లులు ఆపేస్తాం..



రోడ్లు, సీసీ కాలువల నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాల్సిందేనని పంచాయతీరాజ్ ఈఈ టీవీ రమణ సూచించారు. రామభద్రపురం మండలం, ఆరికతోట గ్రామంలో ఉపాధి హామీ పథకం నిధులతో చేస్తున్న సీసీ రోడ్డు, డ్రెయిన్ నిర్మాణాలను ఆయన మంగళవారం పరిశీలించారు. బొబ్బిలి నియోజకవర్గంలోని రామభద్రపురం, బొబ్బిలి, తెర్లాం, బాడంగి మండలాల్లో రూ.28 కోట్ల వ్యయంతో రోడ్లు, కాలువలు వంటి 405 రకాల పనులు గుర్తించామన్నారు. పనులు నాసిరకం అని తేలితే బిల్లులు నిలిపివేస్తామని తెలిపారు. ఆయన వెంట డీఈ అప్పారావు, ఏఈ రమేష్ తదితరులు ఉన్నారు. – రామభద్రపురం

అప్రమత్తతతో కేన్సర్ నివారణ



ప్రపంచ కేన్సర్ నివారణ దినోత్సవం సందర్భంగా బొబ్బిలి సీహెచ్‌సీలో కేన్సర్ నివారణపై మంగళవారం అవగాహన కల్పించారు. అప్రమత్తతతో కేన్సర్ నివారణ సాధ్యమని, ఏదైనా కేన్సర్ లక్షణాలు కనిపించిన వెంటనే ఆస్పత్రిని సంప్రదించి వైద్యుల విలువైన సలహాలు, సూచనలు పాటించాలని వైద్యాధికారి గేదెల భూషణరావు తెలిపారు. – బొబ్బిలి

నూతన బోధనా పద్ధతులు అవలంబించాలి


ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న ఎంఈవో ప్రవీణ్‌కుమార్

రాజాం: విద్యాబోధనలో నూతన బోధనా పద్ధతులు అవలంబించాలని ఎంఈవో బి.ప్రవీణ్‌కుమార్ ఉపాధ్యాయులకు సూచించారు. మండలంలోని పెనుబాక గ్రామ ప్రాథమికోన్నత పాఠశాలను ఆయన మంగళవారం సందర్శించారు. విద్యార్థుల హాజరు శాతంతో పాటు పాఠశాల రికార్డులు, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. చదువులో వెనకబడిన విద్యార్థుల విద్యాప్రగతికి కృషి చేయాలన్నారు. మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం వంటకాలు చేసి, విద్యార్థులకు పెట్టాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఎ.మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.